తల్లుల జాతరలకు ముస్తాబు

అడవి బిడ్డల జాతరగా పేరొంది.. అన్ని వర్గాల ప్రజల ఆరాధ్యదైవాలుగా కొలువబడుతున్న మేడారం సమ్మక్క– సారలమ్మల జాతరకు సమయం ఆసన్నమైంది. జాతరలో భాగంగా ములుగు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వెలసిన సమ్మక్క– సారలమ్మల ఆలయాల్లో మంగళవారం గుడిమెలిగె, మండెమెలిగె కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా దేవతలు కొలువైన ఆలయాలు, తల్లులను ప్రతిష్ఠించే గద్దెలను గిరిజన ఆడబిడ్డలు శుభ్రం చేశారు.

కొండాయిలో గుడిమెలిగె..

● 12నుంచి కొండాయిలో మినీజాతర


గోవిందరాజులు, నాగులమ్మ గుడి

ఏటూరునాగారం : మండలంలోని కొండాయి గ్రామంలో కొలువైన గోవిందరాజులు, నాగులమ్మ, దొడ్ల గ్రామంలోని సారలమ్మ ఆలయం వద్ద నేడు (బుధవారం) గుడిమెలిగె పూజా కార్యక్రమాలు వడ్డెలు చేపట్టనున్నారు. గోవిందరాజుల గుడి వద్ద దబ్బగట్ల గోవర్ధన్, రాజారాం, జనార్దన్, నాగేశ్వర్‌రావు, బాబు పూజారులు ఉదయం వాగు నుంచి జలాన్ని తీసుకువచ్చి గుడిని శుద్ధి చేస్తారు. కొండాయి ఆడపడుచులు ఆలయంలో ముగ్గులు వేసి పడిగెను అలంకరిస్తారు. అలాగే నాగులమ్మ గుడిని అలికి ముగ్గులు వేసి ముస్తాబు చేయనున్నారు. గుడిలోని పసిడి కుండలకు పసుపు రాసి కుంకుమపెట్టి ధూపదీపంతో పూజిస్తారు. ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు జరిగే గోవిందరాజులు, నాగులమ్మ, సారలమ్మ మినీ జాతరకు వారం ముందుగా గుడిమెలిగె పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

జాతరకు భక్తులు తరలిరావాలి

కొండాయిలో ఈనెల 12వ తేదీనుంచి 15వ తేదీవరకు జరిగే గోవిందరాజులు, నాగులమ్మ, సారలమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని గోవిందరాజుల పూజారులు గోవర్ధన్, రాజారం తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 12న గోవిందరాజుల గుడి నుంచి పడిగేను కొండాయిలోని గోవిందరాజుల గద్దెకు చేరుకోవడం జరుగుతుందని, ఇదే రోజు దొడ్ల గ్రామంలో కొలువైన సాలరమ్మను కొండాయిలోని గద్దెకు పూజారి కాక వెంకటేశ్వర్లు తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తారని వెల్లడించారు. అలాగే 13వ తేదీన కొండాయికి రెండు కిలోమీటర్ల దూరంలో కొలువై ఉన్న దేవరగుట్ట నుంచి మధ్యాహ్నం 1గంటకు వనం తీసుకువచ్చి కొండాయిలోని గద్దెల వద్ద ప్రతిష్ఠిస్తారు. సాయంత్రం 4 గంటలకు దేవరగుట్ట నుంచి డప్పు చప్పుళ్లతో ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలతో గోవిందరాజులు, నాగులమ్మను కొండాయిలోని గద్దెల మీదకు పూజారులు, వడ్డెలు తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తారు.

బయ్యక్కపేటలో మండమెలిగె..


బయ్యక్కపేటలో సమ్మక్క- సారలమ్మ గద్దెలు


సమ్మక్క గుడి (ఫైల్)

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండలంలోని బయ్యక్కపేటలో ఈనెల 12 నుంచి 15వతేదీ వరకు సమ్మక్క- సారలమ్మ జాతరను చందా వంశ పూజారులు నిర్వహించనున్నారు. చరిత్ర ప్రకారం.. సమ్మక్క పుట్టిల్లు బయ్యక్కపేటలో నేడు (బుధవారం) మండమెలిగె పండుగ నిర్వహించనున్నారు. గడ్డి గుడిసెతో నిర్మించిన గుడిపై కొత్తగడ్డి కప్పి, మట్టితో అలికి ఆడపడుచులు ముగ్గులు గుడిని అలంకరించనున్నారు. చందా వంశపూజారులు మండమెలిగె పండుగ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈనెల 12న బుధవారం సమ్మక్క గుడిలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గ్రామంలోని గ్రామదేవతలకు పూజలు చేయనున్నారు. అమ్మవారి వడెరాల కుండలను అలంకరించి గుడికి తీసుకెళ్తారు. గ్రామ పొలిమెరల్లో ధ్వజ స్తంభాలను పాతి అష్ట దిగ్బంధం (దుష్టశక్తులు రాకుండా) కార్యక్రమాలను నిర్వహిస్తారు. 13న (గురువారం) ఉదయాన్నే పూజారులు వనం తీసుకొచ్చి అమ్మవార్ల గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. సాయంత్రం సమయంలో గ్రామ సమీపంలోని దేవర గుట్ట నుంచి సమ్మక్క తల్లిని పూజారులు డోలివాయిద్యాలతో తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠించనున్నారు. 14న శుక్రవారం గ్రామంలోని ఆదివాసీలతోపాటు ఆదివాసీయేతరులు, ఇతర ప్రాంతాల భక్తులు బయ్యక్కపేటకు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. 15న సమ్మక్కతల్లి వనప్రవేశం చేయనున్నట్లు పూజారి చందా రఘుపతి తెలిపారు.

నేటినుంచి ఫ్రూట్ ఫాంలో..

గోవిందరావుపేట:మండల పరిధిలోని చల్వాయి పంచాయతీ పరిధిలోని ఫ్రూట్ ఫాం గ్రామంలో నేటినుంచి మూడ్రోజులపాటు సమ్మక్క–సారక్క జాతర జరుగనుందని పూజారి ఈసం సమ్మయ్య తెలిపారు. ఈసందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ రెండేళ్లకు ఒకసారి ఫ్రూట్ ఫాం గ్రామంలో జాతర నిర్వహిస్తామని అన్నా రు. భక్తులు తరలివచ్చి జాతరను విజయవంతం చేయాలని కోరారు.


ఫ్రూట్ ఫాంలోని సమ్మక్క-సారక్క గుడి

క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



వాజేడు: మండలంలో రథ సప్తమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగన్నాథపురంలో సూర్య భగవానుడికి పసుపులేటి సూర్యలక్ష్మి అనే భక్తురాలు కూరగాయలతో రథాన్ని, పిడకలపై పాలు, చెరుకు గడలు, పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అద్దంలో సూర్య భగవానుడిని చూస్తూ పూజలను చేశారు.

సీతారామాంజనేయస్వామి ఆలయంలో..

మంగపేట : మండలంలోని బోరునర్సాపురం సీతారామాంజనేయ స్వామి ఆలయంలో 18వ వార్షికోత్సవం సందర్భంగా వార్షికోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయ పూజారి మధుసూదనాచార్యులు ఆధ్వర్యంలో వేదాధ్యయనంతో వార్షికోత్సవ పూజలను ప్రారంభిచారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఘనంగా మొహియుద్దీన్ జయంతి



ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని ఇందిరానగర్‌లోని జెడ్పీ పాఠశాలలో ఎస్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు ముగ్ధుమ్ మొహియుద్దీన్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, హెచ్‌ఎం సాలెం కృష్ణయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి పోరిక శంకర్, మండల అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి శాంసన్, ఉపాధ్యాయులు పద్మజ, కవిత, రాజ్ కుమార్, రాజబాబు పాల్గొన్నారు.

కూలిపోయిన పూరిల్లు



మంగపేట : మండలంలోని రమణక్కపేట ఎస్సీ కాలనీకి చెందిన ఇల్లందుల సమ్మయ్య –రామక్క దంపతుల పూరిగుడిసె మంగళవారం కూలిపోయింది. బాధితులు తెలిపిన వివరాలు.. శిథిలావస్థకు చేరిన ఇల్లు కూలిపోయే పరిస్థితి ఉన్నప్పటికి మరమ్మతులు చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో కొంత కాలంగా పక్కింట్లో తలదాచుకుంటున్నారు. దీంతో ఇంట్లోని గృహోపకరణలు ధ్వంసమై పనికి రాకుండా పోవడంతో సుమారు రూ.50,000 వరకు నష్టం వాటిల్లినట్లు వాపోయారు. నిరుపేద దళిత కుటుంబానికి ప్రభుత్వం స్పందించి తక్షణం ఆర్థిక సాయం అందించి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

గుడుంబా స్వాధీనం

వాజేడు : గుడుంబా విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని అయ్యవారిపేట గ్రామంలో పెట్రోలింగ్ చేస్తుండగా అదే గ్రామానికి చెందిన జనగాం వెంకట రమణ ఇంట్లో సోదాలు చేసినట్లు, అతని వద్ద 150 లీటర్ల గుడుంబా ఉన్నట్లు ఎస్సై తెలిపారు. నాటుసారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఎస్సైతో పాటు హెడ్ కానిస్టేబుల్ సంతోష్, కానిస్టేబుల్ సత్యా న్వేష్, నరేష్ ఉన్నారు.

మహిళలకు సేవింగ్స్ అకౌంట్‌పై అవగాహన

ఏటూరునాగారం: మండల కేంద్రం పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక ఏటూరునాగారంలోని కెనరా బ్యాంకు వారి సౌజన్యంతో మహిళల కోసం ప్రవేశపెట్టిన 'కెనరా ఏంజెల్ ఉమెన్స్ స్పెసిఫిక్ సేవింగ్స్ అకౌంట్' అనే కొత్త బ్యాంకింగ్ అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఈట రేణుక కార్యక్రమాన్ని ప్రారంభించగా.. కెనరా బ్యాంక్ మేనేజర్ హరిప్రసాద్ అవగాహన కల్పించారు. మహిళలను ఆర్థికంగా శక్తివంతులుగా తయారు చేయడం కోసం కెనరా బ్యాంక్ ఈ నూతన విధానాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. 18 సంవత్సరాల నుంచి వృద్ధులైన మహిళలు ఈ అకౌంట్ తీసుకోవచ్చని సూచించారు. దీనిలో కేన్సర్ బీమా, బ్యాంక్ లాకర్‌పై మహిళలకు రాయితీ, వ్యక్తిగత ప్రమాద బీమా మొదలైన సౌకర్యాలను కెనరా బ్యాంకు కల్పిస్తోందన్నారు. మహిళలందరూ ఈ అకౌంట్ ఓపెన్ చేసుకొని లబ్ధిపొందాలని తెలిపారు. ఈట నవీన్, వెంకటయ్య, జ్యోతి, ఫాతిమా, శేఖర్, సంపత్, రమేష్, జీవవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

చైల్డ్ లిట్రసీ సెంటర్ ప్రారంభం


వాజేడు: సెంటర్ ప్రారంభిస్తున్న ఎంఈఓ

వాజేడు : మండలంలోని నాగారం ప్రాథమిక పాఠశాలలో చైల్డ్ లిట్రసీ సెంటర్‌ను ఎంఈఓ వెంకటేశ్వర్లు మంగళవారం ప్రారంభించారు. చైల్డ్ ఫర్ ఇండియా అనే ఎన్జీఓ సంస్థ ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అవసరమయ్యే ఆట వస్తువులు, విద్యా బోధన పాఠ్యపుస్తకాలను చైల్డ్ ఫర్ ఇండియా ప్రతినిధులు అందించనున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఓలమ్ ఫుడ్ ఇంగ్రిడియన్స్ వారి సహకారంతో పని చేసే చైల్డ్ ఫర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎన్జీఓ సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ ఎస్.బుచ్చిబాబు, ఉపాధ్యాయులు మనోజ్, శిరీష ఉన్నారు.

రైతు మహాసభలు విజయవంతం చేయండి

వాజేడు: ఈ నెల 12న జిల్లా కేంద్రంలో జరిగే రైతు మహాసభలకు ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున్‌రావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించిన పంటలకు గిట్టు బాటు ధర కల్పించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతు మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో జంపాల రవీందర్, పాషా, రాజు, సంతోష్, రాంబాబు, నర్సింహరావు, సాంబశివరావు ఉన్నారు.

పేదలకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్


ములుగు రూరల్: మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు


గోవిందరావుపేట : క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం

ములుగు రూరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రయోజనాలకు అనుకూలంగా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర పన్నుల్లో వాటా రూ.23,400 కోట్లు కేటాయించిందని అన్నారు. కేంద్రం బడ్జెట్‌లో సంవత్సరానికి రూ.12లక్షల ఆదాయం ఉన్నవారికి పన్ను మినహాయించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. కేంద్ర నిధులతో రాష్ట్రంలో ఎయిమ్స్ నిర్మాణం, సనత్‌నగర్, రామగుండం, హైదరాబాద్‌లో ఆస్పత్రుల నిర్మాణాలు జరుగుతున్నాయని అన్నారు. మేడారం జాతరకు రూ.21 కోట్లు, గిరిజన మ్యూజియం ఏర్పాటు, ఆయుష్మాన్ భారత్ నిధుల పెంపు చేపట్టిందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయించడం లేదని ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భూక్య జవహర్‌లాల్, రవీంద్రాచారి, కృష్ణాకర్, శ్రీనివాసరావు, రవిరెడ్డి, రాజ్‌కుమార్, సునీల్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

గోవిందరావుపేట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజా రంజక, ప్రజాభిమానం, ప్రజల శ్రేయస్సుకు పట్టమని బీజేపీ మండల నాయకులు అన్నారు. మండల పరిధిలోని పస్రా గ్రామంలో మంగళవారం బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గత పదేళ్ల నుంచి ప్రజా శ్రేయస్సు, దేశాభివృద్ధికి బడ్జెట్ ప్రవేశ పెడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగు రవీందర్ రెడ్డి, కార్యదర్శి కొత్త సుధాకర్, మెరుగు సత్యనారాయణ, ఏదునూరి రమేష్, వి.సోమిరెడ్డి, యార్లగడ్డ నాగేశ్వరరావు, బైరి గణేష్, గజ్జి కుమార్, ఆకుల రవీందర్, అమ్మ లింగయ్య, అమ్మ సేనాపతి, అబ్బోజు రమేష్, సమ్మక్క, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్‌రావు

ములుగు రూరల్ : సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణకు అవకాశం ఉంటుందని, ప్రజలు సహకరించాలని ఎస్సై వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని ఇంచర్ల గ్రామంలో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుపై ఆయన స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగిన క్రమంలో నిందితులను గుర్తించేందుకు, రోడ్డు ప్రమాదాలు సమయంలో వాహనాల గుర్తింపునకు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలను అమలు చేయాలి


మాట్లాడుతున్న బుచ్చయ్య

వాజేడు : ఏజెన్సీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు టింగ బుచ్చయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లక్ష్మీపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో 1/70, పెసా చట్టాలతో పాటు ఎల్‌టీఆర్ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఏజెన్సీలోని ఆదివాసీ విద్యార్థులకు విద్యం, వైద్యం సక్రమంగా అందడం కోసం తగిన సిబ్బందిని నియమించాలని కోరారు. ఈ సమావేశంలో నర్సహరావు, సంతోష్, సుధాకర్, శ్రీకాంత్, నవీన్ తదితరులు ఉన్నారు.

మహాసభకు ఎమ్మార్పీఎస్ టీఎస్ మద్దతు

● జిల్లా అధ్యక్షుడు ఎలకటి రాజయ్య


సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

భూపాలపల్లి రూరల్ : ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 7వతేదీన హైదరాబాద్‌లో తనపెట్టిన లక్ష డప్పులు–వేలగొంతుకుల మహసభకు ఎమ్మార్పీఎస్ (టీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటించారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలకటి రాజయ్య తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ 30ఏళ్ల పోరాటం మాదిగ, మాదిగ ఉపకులాలకే కాకుండా సమాజంలోని సబ్బండ వర్గాల ప్రయోజనం కోసం పని చేసిన నాయకుడని, ఆయన కృషిని గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించడం జరిగిందన్నారు.

స్థానిక ఎన్నికలకు అధికారులు సిద్ధం

● రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీఓల సమావేశం


వాజేడు: సమావేశంలో పాల్గొన్న అధికారులు


మంగపేట: మాట్లాడుతున్న ఎంపీడీఓ భద్రు

వాజేడు: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని మండల అధికారులు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్, ఎంపీడీఓ విజయ, ఎంఈఓ వెంకటేశ్వరరావు, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటరు లిస్టులో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని సూచించారు. రానున్న ఎన్నికలకు అధికారులంతా సిద్ధంగా ఉండాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీలను 4 క్లస్టర్లుగా విభజించినట్లు పేర్కొన్నారు.

గోవిందరావుపేట: ఎంపీడీఓ జవహర్ రెడ్డి అధ్యక్షతన తహసీల్దార్ సృజన్ కుమార్, పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సంస్థల ఎన్నికలపై రాజకీయ పార్టీ నాయకులతో ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జవహర్ రెడ్డి మాట్లాడుతూ.. త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ఓటరు జాబితాల పై రాజకీయ నాయకుల అభ్యంతరాలు, సలహాలు, సూచనలు స్వీకరించామన్నారు. వాటిని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం అధ్యక్షులు, కార్యదర్శులు, ఎంపీఓ శరత్ బాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

మంగపేట : మండలంలో పలు గ్రామాల్లో మూడు కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ భద్రు తెలిపారు. ఎంఈడీఓ కార్యాలయంలో మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీఓ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణలో భాగంగా మండలంలోని కొత్తచీపురుదుబ్బ, శనిగకుంట, తొండ్యాల లక్ష్మీపురంలో కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేంలో కార్యాలయ సూపరింటెండెంట్ ఆలేటి సుదర్శన్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సన్మానం


సన్మానిస్తున్న పార్టీ నాయకులు

ములుగు రూరల్ : భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భూక్య జవహర్‌లాల్‌ను పార్టీ నాయకులు సన్మానించారు. ఈ మేరకు మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, బాబు, సంపత్, పాపిరెడ్డి, కిరణ్, రవిందర్, శ్రీహరి, సారయ్య, హరీష్, నరేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పాటుపడాలి

ములుగు రూరల్ : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని ములుగు ఎస్సై వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని జంగాలపల్లిలో రోడ్డు ప్రమాదాల నివారణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో మద్యం తాగకూడదని, రాంగ్ సైడ్, మైనర్ డ్రైవింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపరాదని హెచ్చరించారు. జంగాపల్లి జంక్షన్‌లో యూ టర్న్ తీసుకునే సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా బారికేడ్లు, చెట్లు ఉన్న విషయం తెలపగా పంచాయతీ సిబ్బందితో వాటిని తొలగించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ యమున

మంగపేట : పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని డాక్టర్ చినపెల్లి యమున అన్నారు. మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీలో పీహెచ్‌సీ పరిధిలోని ఆశావర్కర్లకు నులిపురుగులు, వాటి వలన వచ్చే అనారోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యమున మాట్లాడుతూ.. ఈనెల 17న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు 01 నుంచి 19 సంవత్సరాల పిల్లలందరికీ నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను వేయాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ శైలజ, హెచ్‌వీ పద్మ, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న మల్లేషం

ములుగు రూరల్ : పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లేషం అందించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ అకాడమి ఆఫ్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ (ఐఏసీఈ) వారి సహకారంతో కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ రాధిక ఆధ్వర్యంలో మెటీరియల్ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు పూర్తిస్థాయి గైడెన్స్ ఇచ్చేందుకు కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని చెప్పారు. విద్యార్థులు డిగ్రీ స్థాయిలోనే లక్ష్యాలను ఎంచుకొని ఆ దిశగా అడుగు వేయాలని అన్నారు. స్వీయ క్రమశిక్షణతో కష్టపడి చదివితే లక్ష్యం సాధ్యమవుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఐఏసీఈ రిసోర్స్ పర్సన్ మహిత, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాలయ్య, అకాడమి కోఆర్డినేటర్ భాస్కర్, టీఎస్‌కేసీ కన్వీనర్ కవిత, అధ్యాపకులు సరిత, శిరిష, జగదీష్, ఉదయశ్రీ, విజిత పాల్గొన్నారు.

పరామర్శ

ములుగు రూరల్ : మండలంలోని పత్తిపల్లి గ్రామ పంచాయతీ పరిధి కొడిశాలకుంట గ్రామానికి చెందిన మూడు సర్వన్‌నాయక్ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్ పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. సర్వన్‌నాయక్ పార్థివ దేహనికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సానికొమ్ము ఆదిరెడ్డి, మోతీలాల్ ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం


వినయ్‌కు కండువా కప్పుతున్న దేవేందర్

ఎస్‌ఎస్‌తాడ్వాయి : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు కృషి చేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా క్లస్టర్ ఇన్‌చార్జ్‌లను నియమించారు.కాగా కాటాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు ఇందారపు వినయ్ పార్టీలో చేరారు. మేడారం జాతర చైర్మన్ అరెంలచ్చుపటేల్, సహకార సంఘం మాజీ చైర్మన్ పాక సాంబయ్య, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండీ ముజఫర్, మాజీ సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.